సాక్షి కర్నూలు

గురువారం । 12 । జనవరి । 2023



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై బుధవారం విజయవాడ అభినయ ఆర్ట్స్ అకాడమీకి చెందిన కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది.



అన్నదానానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన ఫణీశ్వర్ రూ. లక్ష, విజయవాడకు చెందిన బండి లక్ష్మణరావు రూ. లక్ష విరాళం అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,622.21
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:67.745
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,099

న్యూస్‌రీల్

12లోపు అభ్యంతరాల స్వీకరణ

కర్నూలు(హాస్పిటల్): అర్బన్ ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ లిస్ట్‌ను http://kurnool.ap.gov.inలో ఉంచినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి వివరాలు సరిచూసుకుని, ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గతంలో దరఖాస్తులు ఇచ్చిన యుపీహెచ్‌సీ(అర్బన్ హాస్పిటల్)లో అభ్యంతరాలను ఇవ్వాలని పేర్కొన్నారు. మొదటగా దరఖాస్తుతో పాటు ఇచ్చిన సర్టిఫికెట్లు మాత్రమే పరిగణనలోకి తీసుకుని మార్పులు చేస్తామని తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నేటి నుంచి ఇంటర్వ్యూలు

కర్నూలు(రాజ్‌విహార్): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు గురువారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కర్నూలు ప్రాజెక్టు డైరెక్టర్ కేఎల్ఆర్‌కే కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు పత్తికొండ, మధ్యాహ్నం 2 గంటలకు కర్నూలు డివిజన్, 13న ఉదయం 9గంటలకు ఆదోని డివిజన్ కేంద్రంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో తమ డివిజన్ కేంద్రానికి హాజరు కావాలని సూచించారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ రంగారెడ్డి

గోనెగండ్ల: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, ఇందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని డీఈఓ రంగారెడ్డి సూచించారు. బుధవారం ఆయన గోనెగండ్ల మండలంలోని హెచ్. కైరవాడి జిల్లా పరిషత్ ఉన్నత, గోనెగండ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. లెసన్ ప్లానింగ్ డైరీలు రాయని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంఈఓ వినోద్ కుమార్‌ను ఆదేశించారు. బోధన విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోనెగండ్ల కురుపేట పాఠశాలలో శుద్ధజలం యంత్రాన్ని, గోనెగండ్ల బస్టాండ్ పాఠశాలలో నాడు-నేడు కింద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు.

శకటాల నమూనాల సమర్పణ

కర్నూలు(సెంట్రల్): గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26వ తేదీన వివిధ శాఖలు ప్రదర్శించే శకటాలు, స్టాళ్ల వివరాలను బుధవారం జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డికి అధికారులు సమర్పించారు. మొత్తంగా 12 శాఖల ఆధ్వర్యంలో శకటాలు, 10 శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు.

డీసీసీబీ పాలకవర్గం పదవీ కాలం పొడిగింపు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) ఏడుగురు సభ్యుల నాన్ అఫిషియల్ పాలకవర్గం పదవీ కాలాన్ని ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఎస్.మహాలక్ష్మి నేతృత్వంలో నాన్ అఫిషియల్ పాలకవర్గం కొనసాగుతోంది. పదవీ కాలం ఈనెల 17 వరకు ఉంది. ఇదే పాలకవర్గం పదవీకాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి జీవో ఆర్‌టీ నం.41 జారీ చేశారు. మహాలక్ష్మి నేతృత్వంలోని పాలకవర్గం పదవీకాలాన్ని జూలై 17 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ పాలకవర్గంలో సభ్యులుగా గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, సీమ సుధాకర్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, కె.వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వరమ్మ, మూలింటి రాఘవేంద్ర ఉన్నారు.

ఈడబ్ల్యూఎఫ్ రుణాలు మంజూరు

కర్నూలు(సెంట్రల్): ఎంప్లాయ్ వెల్ఫేర్ ఫండ్(ఈడబ్ల్యూఎఫ్) కింద 84 మంది ఉద్యోగులకు రూ.16,80,000 రుణాలు మంజూరు చేసినట్లు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సాయంత్రం డీఆర్వో కార్యాలయంలో ఏపీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ ఫండ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మెంబర్ సెక్రటరీ కమ్ ట్రెజరర్ బి.రామచంద్రరావుతోపాటు ఉద్యోగ సంఘాల నాయకులు వెంగళరెడ్డి, మద్దిలేటి, కాశన్న, జవహర్‌లాల్ హాజరయ్యారు. ఈసందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఈడబ్ల్యూఎఫ్ కింద రూ.58,26,050 మొత్తం ఉండగా, గతేడాది 31 మందికి రూ. 6,20,000 మంజూరు చేశామన్నారు. ఈ యేడాది 84 మందికి రూ. 16,80,000 మంజూరు చేశామన్నారు.

మూగ నేస్తాలు.. మౌన భావాలు

విస్తరిస్తున్న పక్షుల పెంపకం

- ఖర్చుకు వెనుకాడకుండా కొనుగోలు
- ప్రేమతో దగ్గరవుతున్న మూగప్రాణులు
- పావురాలు, కుందేళ్లు, వెరైటీ పిల్లులకూ చోటు
- మాటలతో మాయచేస్తున్న ఆఫ్రికన్ బర్డ్స్
- మానసిక ప్రశాంతతకు పెద్దపీట



కృష్ణానగర్‌లో సన్‌కొనూర్ చిలుక



ఫొటోలు : డి.హుస్సేన్

మనుషుల మధ్య దూరం పెరుగుతోంది. పక్క పక్కనే ఇళ్లు ఉంటున్నా.. అంటీముట్టనట్లుగా ఉండటం పరిపాటిగా మారింది. మనసు విప్పి మాట్లాడుకోవటం మాని, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ యంత్రాలతో సావాసం చేయడం అధికమైంది. పల్లెటూళ్లలో కాస్త కలివిడితనం ఉంటున్నా.. పట్టణాల్లోని కాంక్రీట్ వనాల్లో ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా జీవనం సాగుతోంది. ఈ కోవలో ఏదో కోల్పోయిన భావన ప్రతి ఒక్కరిలో కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితి నుంచి బయటపడేందుకు మూగజీవాలతో స్నేహం కాస్త ఊరటనిస్తోంది. మాటలు రాకపోయినా మనసుకు దగ్గరయ్యే స్వభావం ప్రశాంతత చేకూరుస్తోంది.

– పి.ఎస్.శ్రీనివాసులు నాయుడు/కర్నూలు డెస్క్

బర్డ్స్‌లో రకాలు - వాటి ధరలు (జత)

మకావ్	రూ.2లక్షల - రూ. 5 లక్షలు
గల్లాకాక్	రూ.1.5లక్షలు - రూ.2లక్షలు
ఆఫ్రికన్ లవ్ బర్డ్స్	రూ.7వేలు
ప్రిన్సెస్	రూ.1,000
లవ్‌బర్డ్స్	రూ.600 - రూ.1000
కాక్‌టైల్	రూ.7,000 - రూ.10,000
స్పాన్‌జిల్ లవ్ బర్డ్స్	రూ.15వేలు
ఆఫ్రికన్ పిచ్చుకలు	రూ.600 - రూ.1,000
చిలుకలు	
ఇండియన్ చిలుకలు	రూ.1,200
జావా ప్రిన్సెస్	రూ.4వేలు-రూ.6వేలు
పావురాల ధరలు	
హోమర్	రూ.2వేలు
సాధారణ పావురాలు	రూ.1,200
ఫారెన్టు పీజియన్	రూ.1,000
షూ	రూ.6వేలు
పీకాక్ పీజియన్	రూ.8వేలు
పల్టీ పీజియన్	రూ.12వేలు
సాధారణ ర్యాబిట్స్	రూ.1,000
న్యూజిల్యాండ్‌వైట్	రూ.2వేలు
నాటు కుందేళ్లు	రూ.1,000

చెట్టుపై నిద్రపోయిన పక్షులన్నీ తెల్లారింది లెవండోయ్ అన్నట్లు ఒక్కసారిగా పైకి లేచి ఆహార వేటకు పయనమవడం.. గంప కింద కోడి కొక్కొరొక్కోమని మేల్కొలపడం.. పిడికెడంత కూడా లేని పిచుకలు కీచుకీచుమంటూ ఇంటి ముందు వాలి గింజల కోసం వెతుకులాడటం.. పెంపుడు కుక్కలు యజమాని వెంట పొలం బాట పట్టడం.. పశువులు పొలం పనులకు సిద్ధమవడం.. ఇదీ పల్లె జీవనం. మనిషి జీవితంలో ఈ మూగప్రాణాలు ఓ భాగం. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ వీటితో అనుబంధం క్రమంగా తగ్గిపోతోంది. యాంత్రిక జీవనంలో మునిగితేలుతూ మానసిక ఆనందాన్ని కోల్పోతున్న వేళ ఇప్పుడిప్పుడే మూగ ప్రాణుల మీద మమకారం పెరుగుతోంది. డబ్బు పోయినా పర్వాలేదు.. మనసు విప్పి మాట్లాడితే మనసుకు సాంత్వన లభిస్తుందనే అభిప్రాయం క్రమంగా పెరుగుతోంది.

కర్నూలు నగరంలోని కృష్ణానగర్‌లో నివాసం ఉంటున్న ఖలీల్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇతనికి చిన్నప్పటి నుంచి మూగజీవాలంటే ప్రాణం. మొదట కుక్కలు, పిల్లులతో సావాసం చేసినా, ఐదేళ్లుగా పక్షులను తన జీవితంలో భాగం చేసుకున్నాడు. సాధారణంగా ఒకటో, రెండో పక్షులను ఓ చిన్న కేజ్‌లో బంధించి అమితమైన ప్రేమను చూపడం సహజం. ఇందుకోసం వెచ్చించే డబ్బు కూడా వేలల్లోనే ఉంటుంది. అయితే ఇతను తన ఇంటి ఆవరణనే పెద్ద బోనుగా మలచడం విశేషం. పక్షుల స్వేచ్ఛా విహంగానికి అనుగుణంగా తీర్చిదిద్దిన ఈ బోనుకు చేసిన వ్యయం అక్షరాలా రూ.3లక్షల పైమాటే. ఇక ఈ ఐదేళ్లలో అతను పెంచుతున్న పక్షుల ఖరీదు రూ.7లక్షల పైనే కావడం చూస్తే ఆ మూగ ప్రాణులు అతని జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేశాయో తెలుస్తోంది. ఇంతే కాదు.. ప్రతినెలా వీటికి చేస్తున్న ఖర్చు రూ.5వేల వరకు ఉంటోంది.

కింద పడితే తినవు..

డబ్బు విలువ పెరుగుతున్న కొద్దీ ఆహారం దొరకడం కూడా కష్టతరమవుతోంది. నిరుపేదలు ఇప్పటికీ దుర్భర జీవనం గడపటం చూస్తున్నాం. కొందరికి డబ్బు ఎక్కువై ఆహార పదార్థాలను వీధులపాలు చేస్తే.. ఇప్పటికీ ఆ విస్తర్లకేసి చూసే జనం ఉన్నారంటే అతిశయోక్తి కాదు. అయితే కొన్ని పక్షుల విషయానికొస్తే.. కింద పడిన గింజలను ముట్టుకోవంటే ఆశ్చర్యమేస్తుంది. యజమాని ఎంతో ఇష్టంగా వాటి నోటికి అందించే దేనినైనా తినే ఈ పక్షులు, నోరు జారితే వాటికేసి కూడా చూడక పోవడం వింతేమరి.

కుటుంబ సభ్యుల్లానే..

పక్షుల పెంపకం కుటుంబంలో భాగమవుతోంది. వీటి పెంపకం కాస్త కష్టమే అయినా ఇష్టాన్ని పెంచుకుంటే కుటుంబ సభ్యుల తరహాలోనే దగ్గరవుతున్నాయి. ఉరుకులు పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి సమయంలో కొద్దిసేపు పక్షులతో గడిపితే మానసిక ఆనందం లభిస్తుందని పక్షుల ప్రేమికులు చెబుతున్నారు. ఇక ఉదయాన్నే పాఠశాలకు, కళాశాలలకు వెళ్లే పిల్లలు సైతం వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు వీటిపై అమితమైన ప్రేమను చూపుతూ స్నేహితుల్లా భావిస్తుండటం విశేషం.

కదలికలు పసిగట్టి.. బాధ తెలుసుకొని

పక్షుల పెంపకం కత్తి మీద సాములాంటిదే. వాటితో ఎంత అభిమానం పెంచుకుంటే అంత దగ్గరవుతాయి. కొన్నాం.. తెచ్చుకున్నాం.. అని కాకుండా, ప్రతి రోజూ వాటితో కొంత సమయం గడిపినప్పుడే ఏం తింటున్నాయి, ఆరోగ్యం ఎలా ఉందనే విషయాలు తెలుస్తాయి. ముందు రోజు వేసిన ఆహారం తినకపోతే ఏదో అనారోగ్యంతో ఉన్నట్లుగా గుర్తిస్తారు. లేదా కదలికలు రోజులాగా ఉండకపోయినా ఏదో బాధలో ఉన్నట్లు అర్థమవుతుంది. ఆ మేరకు వాటికి చికిత్స అందించాల్సి ఉంటుంది. ఇక ప్రతి సంవత్సరం వీటికి వ్యాక్సినేషన్ చేయిస్తే ఆరోగ్యంగా ఉంటాయని యజమానులు చెబుతున్నారు.

పెరుగుతున్న పక్షుల విక్రయ వ్యాపారం

మారుతున్న ప్రజల అభిరుచి వ్యాపార పరంగానూ అభివృద్ధి చెందుతోంది. అక్వేరియంలతో పాటు వివిధ రకాల పక్షులు, కుందేళ్ల విక్రయ దుకాణాలు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. దుకాణాల్లో పక్షులను ఉంచేందుకు రంగురంగుల పంజరాలు ఉంటున్నాయి. వీటికి అవసరమైన ఆహారాన్ని కూడా యజమానులు దుకాణాల్లోనే విక్రయిస్తున్నారు. పక్షుల పెంపకానికి అవసరమైన సామగ్రిని చెన్నై, కోల్‌కతా, బెంగళూరు నుంచి తెప్పిస్తున్నారు.



తాబేళ్లలో

వివిధ రకాలు ఉన్నాయి. నక్షత్ర తాబేళ్లు, గోల్డ్ రంగు తాబేలు, గ్రీన్ తాబేళ్లు తదితరాలు. వీటిలో గ్రీన్ తాబేలు అమ్మడానికి, పెంచడానికి మాత్రమే అనుమతులు ఉన్నాయి. ఇటీవల కాలంలో చాలా ఇళ్లలో ఈ తాబేళ్లు కనిపిస్తున్నాయి. వీటి ధర రూ. 500 నుంచి రూ.2 వేల వరకు ఉంటోంది.

దీపావళి అంటే దడ

పక్షులకు దీపావళి వస్తే దడ. టపాసుల శబ్దాలకు బెంబేలెత్తుతాయి. కొన్ని పెంపుడు పక్షులు ఆ శబ్దాలకు మృత్యువాత పడుతున్నాయి. దీపావళి సమయంలో వీటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తప్పవని యజమానులు చెబుతున్నారు.

వాటితో గడిపితే సమయమే తెలియదు



మనిషికి కష్టం వస్తే మాటల్లో చెప్పుకోగలం. పక్షులు తమ బాధను చెప్పుకోలేవు. మనమే అర్థం చేసుకోవాలి. ఉదయం లేవగానే వాటి వద్దకు వెళ్లడం, వాటి బాగోగులను పరిశీలించడం.. స్నేహంగా మెలగడం నా దినచర్యలో భాగమైంది. కనీసం ఓ గంట వాటితో ఉంటే ఏదో తెలియని ఆనందం నాలో కలుగుతుంది. కొత్త వ్యక్తులు వీటి దగ్గరకు వస్తే పెద్ద శబ్దాలు చేస్తూ అటూఇటూ ఎగురుతుంటాయి. నేను కనిపించగానే ఎంతో ప్రేమతో నా మీద వాలిపోతాయి. మనుషుల్లో మానవత్వం లోపిస్తున్న వేళ ఇలాంటి మూగ ప్రాణులు ఎంతో ప్రేమను కురిపిస్తాయి. ఎంత డబ్బిస్తే ఈ ఆనందాన్ని కొనగలం.

– ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్, కృష్ణానగర్, కర్నూలు

పావురాల పెంపకం ఎంతో ఇష్టం



చిన్నతనం నుంచి పావురలంటే అమితమైన ఇష్టం. మొదట్లో నా వద్ద 10 పావురాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు ఎనిమిది రకాలు, వందకు పైగా పావురాలు ఉన్నాయి. ఇంటికి సమీపంలో ఓ షెడ్ ఏర్పాటు చేసుకొని పెంచుతున్నా. రేసింగ్ హ్యామర్ పావురం ఖరీదు జత రూ.5వేల వరకు ఉంటోంది. 100, 1000 కిలోమీటర్ల పోటీల్లోనూ నా పావురాలు పాల్గొంటాయి. బెట్టింగ్ కాకుండా పావురాల్లోని సత్తా చాటేందుకు పోటీలకు వెళ్తుంటాం.

– షేక్ ఇబ్రహీం, కింగ్‌మార్కెట్, కర్నూలు

ఇంట్లో మనిషిగానే..



మా ఇంట్లో ఐదుగురం ఉంటాం. రెండేళ్ల క్రితం రూ.10వేలతో రెండు పిల్లులను కొనుగోలు చేశాం. వీటిని ముద్దుగా మిన్నూ అని పిలుచుకుంటాం. ఇంట్లో మనిషిలాగా మారిపోయాయి. బయటకు వెళ్లి నా కొద్దిసేపటికే ఇంటికి చేరుకుంటాయి. వీటి ఖర్చు నెలకు సుమారు రూ.4వేల వరకు ఉంటుంది. వీటి ద్వారా మానసిక ఆనందం లభిస్తోంది.

– ఇర్ఫాన్, కొత్తపేట, కర్నూలు

ఆదరణ బాగుంది

నగరంలో పెంపుడు జంతువులు, పక్షులకు ఆదరణ బాగుంది. ఉన్నతశ్రేణి కుటుంబాల్లో వీటిని ఎక్కువగా పెంచుకుంటారు. ఇంట్లో బిడ్డల్లా వీటిని ఆదరిస్తుంటారు. పెంపుడు శునకాలతో పాటు పిచ్చుకలు, పలురకాల పక్షులు, కుందేళ్లను అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. ఎక్కువగా ఇళ్లల్లో అక్వేరియం వుండేందుకు ఇష్టపడుతున్నారు. వివిధరకాల చేపపిల్లలు అందుబాటులో వున్నాయి. బళ్లారి, మైసూర్, హైదరాబాద్ నుంచి ఎక్కువగా వీటిని దిగుమతి చేసుకుంటున్నాం. అభిరుచికి తగ్గట్టు ఖరీదైన పక్షులు, చేపలను పెంచేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఈ వ్యాపారం సంతృప్తికరంగా వుంది.

– మహబూబ్, దుకాణ యజమాని, కర్నూలు



కొత్తపేటలోని ఓ ఇంట్లో ఆకట్టుకునే పిల్లులు





కృష్ణానగర్‌లోని ఓ ఇంట్లో పెంచుతున్న బుడ్గేరిగర్ పక్షులు, గ్రేపారెట్



దేవనగర్‌లోని ఓ ఇంట్లో చిలుకలు



కర్నూలులోని ఓ ఇంట్లో తాబేలు

కమనీయం.. కుంభోత్సవం



పూజలందుకుంటున్న బనశంకరీదేవి

మంత్రాలయం/కౌతాళం: బనశంకరీదేవి (బండమ్మవ్వ) వేడుకల్లో భాగంగా సుళేకేరి గ్రామంలో బుధవారం కుంభోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి కుంభాలతో ఊరేగింపు చేపట్టారు. డప్పు దరువులు, విన్యాసాలు మధ్య వేడుకలు వైభవంగా సాగాయి. గ్రామ వీధులన్నీ కుంభాలతో కనువిందు చేశాయి. ఆచారంలో భాగంగా అవ్వకు వరిబియ్యం, కొర్రబియ్యం, పాలు, పెరుగు, వెన్నతో చేసిన నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో సంగీత విభావరి, చెక్కభజనలు నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

మూడు నెలల ఆచారం

అవధూత బనశంకరీ దేవి 400 ఏళ్ల క్రితం గ్రామానికి వచ్చి ఎన్నో మహిమలు చూపారు. అవ్వ సూచనలు ఆ గ్రామానికి ఆచారంగా మారాయి. అవ్వ ఆజ్ఞ మేరకు నేటికీ గ్రామస్తులు కాడెద్దులకు ప్రతి సోమవారం సెలవు ఇస్తారు. ఆ రోజు ఎద్దులకు స్నానాలు చేయించి, పూజలు గావించి ఇళ్లలోనే ఉంచుతారు. అలాగే శూన్య అమావాస్య నుంచి గ్రామస్తులు ప్రత్యేక ఆచారాలు పాటిస్తారు. పాలు తాగిన రోజు పెరుగు తినరు. పెరుగు తిన్న రోజు పాలు ముట్టరు. వెన్న తీసి అలాగే ఉంచుతారు. వరి, కొర్ర బియ్యం కలిపి అన్నం చేసుకోరు. కుంభాలు వెళ్లిన వాళ్ల ఇళ్లలో కొర్ర అన్నం చేసినా పొలాల్లో చల్లులు కలుపుని భుజించరు. మాంసాహారాన్ని ముట్టరు. మూడు నెలల పాటు ఇదే ఆచారం పాటిస్తారు. బుధవారం అవ్వ జాతర ముగియగానే ఆహార కట్టుబాట్లకు స్వస్తి పలికారు. సోమవారం ఎద్దులకు సెలవు మాత్రం నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తారు.



సుళేకేరిలో కుంభోత్సవ దృశ్యం

చిరు వ్యాపారులకు ఊరట

- జగనన్నతోడు లబ్ధిదారులకు రూ. 10వేల రుణం
- వర్చువల్‌గా రుణాలను జమ చేసిన సీఎం జగన్
- కర్నూలు కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు కాటసాని, చెన్నకేశవరెడ్డి, మేయర్ రామయ్య



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు, ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య

కర్నూలు(సెంట్రల్): జగనన్నతోడు పథకం చిరు వ్యాపారులకు ఎంతో ఊరటను కలిగిస్తోందని పాణ్యం, ఎమ్మిగనూరు శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. జగనన్నతోడు లబ్ధిదారులకు వడ్డీ, కొత్తగా ఎంపిక చేసిన వారికి రూ.10 వేల రుణాన్ని బుధవారం వారి బ్యాంక్ ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్‌గా జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.కోటేశ్వరరావు, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఎంపికైన లబ్ధిదారులు వీక్షించారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యేలు, మేయర్ మాట్లాడుతూ..గతంలో రాష్ట్రాన్ని పాలించిన నేతలు దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజాహిత కార్యక్రమాలు చేయలేదన్నారు. టీడీపీ హయాంలో విజయవాడలో కాల్‌మనీ వ్యవహారం నడిచిందని గుర్తు చేశారు. చిరు వ్యాపారుల ఇబ్బందులు తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వడ్డీ లేకుండా రూ.10 వేల రుణాన్ని అందిస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం రెండుసార్లు లబ్ధిదారులను గుర్తించి రుణాలు ఇవ్వడంతోపాటు కంతుల సక్రమంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీని ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లిస్తోందన్నారు. కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లాలో జగనన్నతోడు పథకం కింద ఆరో విడతలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కలిపి మొత్తం 16,266 మంది లబ్ధిదారులకు రూ.33.28 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఆరు విడతల్లో కలిపి జిల్లాలో జగనన్నతోడు లబ్ధిదారుల సంఖ్య 79,853గా ఉందని, వారికిచ్చిన రుణం మొత్తం 79.89 కోట్లుగా ఉన్నట్లు ఆయన వివరించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు కలిపి మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ శిరోమణి, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, మెప్మా పీడీ నాగశివలీల, ఏపీడీ శ్రీధరరావు, ఎల్‌డీఎం వెంకటనారాయణ పాల్గొన్నారు.

సంతోషంగా జీవిస్తున్నాం

నేను పూల వ్యాపారం చేస్తాను. గతంలో డబ్బుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే వాళ్లం. ఇప్పుడు ఆ కష్టాలు తొలగాయి. ప్రభుత్వమే బ్యాంకు నుంచి రుణం ఇప్పించి వడ్డీ లేకుండా చేస్తోంది. జగనన్న దయతో సంతోషంగా జీవిస్తున్నాం.

– దేవమ్మ, వీకర్ సెక్షన్ కాలనీ, కర్నూలు

అప్పు తిప్పలు తొలగాయి

నేను కూరగాయల వ్యాపారం చేస్తాను. గతంలో బయట అప్పులు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు జగనన్నతోడు కింద రూ.10 వేల వడ్డీ లేని రుణం వస్తోంది. ఎవరి దగ్గరకు వెళ్లాల్సిన పనిలేదు. అప్పు తిప్పలు తొలగాయి.

– కురువ సువర్ణమ్మ, పెద్దపాడు, కల్లూరు మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం

నా భర్త ఆంజనేయులు డప్పు కళాకారుడు కావడంతో రూ.3 వేల పింఛన్ వస్తోంది. నేను పొదుపులో సభ్యురాలు కావడంతో లక్షన్నర రుణం వచ్చింది. టైలరింగ్ పని చేస్తుండడంతో రూ.10 వేలు వడ్డీలేని రుణం ఇచ్చారు. జగనన్నకు రుణపడి ఉంటాం.

–నాయకల్లు మద్దమ్మ, పెద్దపాడు, కల్లూరు మండలం

డైరెక్షన్ అంటే ప్యాషన్



డైరెక్షన్ చేస్తున్న ఈ యువకుడి పేరు మహమ్మద్ సాధిక్. కర్నూలులోని మారుతీ నగర్‌లో నివాసం ఉంటారు. బీకాం డిగ్రీ చదివారు. నాన్న ఖాజాహుసేన్ ఆర్టీసీ ఉద్యోగి. అమ్మ అక్తరున్నీసా గృహిణి. రెండో సంతానమైన సాధిక్‌కు చిన్నప్పటి నుంచి సినిమాలంటే పిచ్చి. మంచి దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నది కల. దీనిని నెరవేర్చుకునేందుకు షార్ట్ ఫిల్మ్స్ తీయడం ప్రారంభించారు. ఈ క్రమంలో సమాజాన్ని చైతన్య పరచడం, వివిధ సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించే అంశాలతో పలు లఘుచిత్రాలను రూపొందించారు. అవి ప్రేక్షకాదరణ పొందడంతో పాటు ఉత్తమ చిత్రాలుగా నిలిచాయి. 2014లో మొదటి షార్ట్ ఫిల్మ్ చిన్ని ఆశ, 2015లో నేను నాన్న, 2016లో త్యాగం, 2017లో మేరా భారత్ మహాన్, 2017లో ప్రయాణం, 2019లో అవర్ ఎమ్మెల్యే చిత్రాలను తెరకెక్కించి పలువురితో ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం డియర్ ఫ్రెండ్ చిత్రం తీయబోతున్నట్లు సాధిక్ పేర్కొన్నారు.

యువ శక్తి.. విజయ దీప్తి

- వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగుతున్న యువత
- విభిన్న రంగాల్లో రాణింపు
- నేడు జాతీయ యువజన దినోత్సవం





వివేకానందుడు ఓ వ్యక్తి కాదు. మహాశక్తి. తన మాటల మంత్రంతో ఎందరినో ప్రభావితం చేశారు.తన వాగ్ధాటితో అందరి హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. దేశ యువతను జాగృతం చేశారు. ఎన్నో ఒత్తిళ్ల మధ్య బతుకుతూ చిన్నచిన్న సమస్యలకే అఘాయిత్యాలకు పాల్పడుతున్న యువకులు వివేకానందుడి గురించి తెలుసుకున్నా, ఆయన సూక్తులు వినినా చాలు ఎనలేని ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన వైపు ముందుడుగు వేస్తారు. అలాంటి మహనీయుడి జయంతిని ఏటా జనవరి 12న జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటాం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 16 లక్షల మంది యువతీయువకులు ఉన్నారు. వీరిలో కొందరు వివిధ రంగాల్లో రాణిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

– కర్నూలు కల్చరల్

ఎందరికో స్ఫూర్తి కీర్తన



చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తోంది లలితకీర్తన. కర్నూలు నగరంలోని సంతోష్ నగర్‌కు చెందిన ఈ యువతి ఇటీవల అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయంలో బీటెక్ పూర్తి చేసింది. తల్లి కె.శ్యామలమ్మ వాణిజ్య పన్నుల శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. కుమార్తెను చిన్నప్పటి నుంచే కఠినమైన మార్షల్ ఆర్ట్స్ క్రీడ వైపు ప్రోత్సహించింది. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ 2015 సంవత్సరంలో ఏకంగా మూడు బంగారు పతకాలు గెలుచుకుంది. ఇందులో రెండు జిల్లా స్థాయిలో, ఒకటి రాష్ట్రస్థాయి పోటీల్లో సాధించింది. 2016 దక్షిణ భారతీయ ఛాంపియన్ షిప్ పోటీల్లో, 2017లో కేరళ రాష్ట్రంలోని కన్నూరు పట్టణంలో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండోలో సత్తాచాటి గోల్డ్‌మెడల్స్ సాధించింది. పురుషులకే పరిమితంగా భావించే తైక్వాండోలో దాదాపుగా ఏడేళ్లుగా పలు బంగారు పతకాలు సాధిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

పోలీస్ అధికారి కావడమే లక్ష్యం



ఈ అమ్మాయి పేరు జి. త్రివేణి. ఎమ్మిగనూరులో జనరల్‌స్టోర్ నిర్వహిస్తున్న పద్మావతి, వెంకటేశ్వర్లు కుమార్తె. కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం బీకాం, డిజిటల్ మార్కెటింగ్ చదువుతుంది. ఎన్‌సీసీలో చురుగ్గా పాల్గొంటుంది. ఈ క్రమంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్ పేరుతో నిర్వహించిన దేశ పర్యటనకు ఎంపికైంది. రాయలసీమ జోన్ నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థిని. పర్యటనలో భాగంగా గతేడాది అక్టోబర్ 9 నుంచి 18వ తేదీ వరకు ఇస్రో, బెంగళూరు, శ్రీహరికోట, హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ వంటి ప్రసిద్ధ శాస్త్ర సాంకేతిక కేంద్రాలను సందర్శించారు. సివిల్స్‌లో రాణించి మంచి పోలీస్ అధికారి కావడం తన లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

ప్రాణాలు తీసిన విద్యుదాఘాతం



మృతి చెందిన గోవింద్

ఆదోనిఅర్బన్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. బసాపురం ట్యాంకు వద్ద బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడి తండ్రి మల్లప్ప, అన్న కృష్ణ తెలిపిన వివరాల మేరకు.. గోవిందు(30) విద్యుత్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. బసాపురం ట్యాంకు వద్ద విద్యుత్ లైన్ లాగేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడు. గాలికి వైర్లు ఊగుతూ గోవిందు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గోవిందుకు భార్య లక్ష్మి, ముగ్గురు మగ పిల్లలు ఉన్నారు. తన కుమారుడు విద్యుత్‌శాఖకు లేబర్ కాదని, కేవలం వైర్ లాగేందుకు వెళ్లాడని, తమ కుమారుడిని ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కించి చంపారని తండ్రి మల్లప్ప ఆరోపించారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్నూలులో జిల్లా స్థాయి పోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ ఇంగ్లిషు మీడియం పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 20, 21 తేదీల్లో జిల్లా స్థాయి అండర్ -14 , ఈనెల 29, 30వ తేదీల్లో అండర్-17 విభాగంలో బాల బాలికలకు రగ్బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు అండర్ -17 బాల బాలికలకు వాలీబాల్, ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు అండర్-14, అండర్-17 విభాగంలో బాలబాలికలకు ఫెన్సింగ్ పోటీలు కర్నూలులోని ఏ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి కృషి

- జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఈఓ

కర్నూలు (టౌన్): యువ క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి శాప్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా శాప్ లీగ్ పేరుతో క్రీడా పోటీలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శాప్ లీగ్ పోటీల్లో మంచి ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ నటరాజారావు, సెట్కూర్ మేనేజర్ సత్యనారాయణ, జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు పాల్గొన్నారు.

వచ్చేనెల 14 నుంచి శివరాత్రి ఉత్సవాలు



శివరాత్రి పనులను ప్రారంభిస్తున్న ఈఓ, ధర్మకర్తల మండలి సభ్యులు

మహానంది: ఫిబ్రవరి 14 నుంచి మహానందిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పనులను బుధవారం ప్రారంభించారు. జంగిల్ క్లియర్స్ పనుల్లో భాగంగా ప్రారంభ పూజలు చేపట్టి ఈఓ మాట్లాడారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతేడాది కంటే ఈసారి శివరాత్రి ఉత్సవాలకు మరింత మెరుగ్గా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వేదపండితులు రవిశంకర అవధాని, ధర్మకర్తల మండలి సభ్యులు గంగిశెట్టి మల్లికార్జునరావు, వీరభద్రుడు, సూపరింటెండెంట్ ఒంకారం వెంకటేశ్వరుడు, అర్చకులు పాల్గొన్నారు.

చెంచుగూడేలలో మొబైల్ ఆధార్ కేంద్రాలు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



నాయినీ చెర్వు చెంచుగూడెంలో మొబైల్ ఆధార్ కేంద్రం

నంద్యాల: ఆధార్ కార్డు లేక చెంచు గూడేల గిరిజనులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తక్షణమే స్పందించారు. జిల్లాలోని అన్ని చెంచుగూడేలలో 13, 14 తేదీల్లో మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాల శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు జిల్లా కలెక్టర్ మంగళవారం బండిఆత్మకూరు మండలం నాయిని చెరువు చెంచుగూడెంలో ఆకస్మికంగా పర్యటించారు. ఆ సమయంలో గూడెంకు చెందిన దివ్యాంగురాలు దాసరి ఈదమ్మ తనకు పింఛన్ రావడం లేదని ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. కాగా కలెక్టర్ పరిశీలనలో సుమారు 12 మందికి ఆధార్ కార్డులు లేవని తెలుసుకున్నారు. తక్షణమే స్పందిస్తూ బుధవారం గూడెంలో ఆధార్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయించి దరఖాస్తు చేయించారు. అలాగే దాసరి ఈదమ్మకు మూడు చక్రాల సైకిల్‌ను కూడా అందజేయించారు. అలాగే చెంచు గూడేలలో ఆధార్ సమస్యను పరిష్కరించేందుకు జిల్లా వ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో అన్ని చెంచుగూడేలలో మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి సంబంధిత సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రెటరీలకు ఆధార్ నమోదుకు కావాల్సిన సామగ్రి, ఇతర మెటీరియల్ సమకూర్చుకోవాల్సిందిగా సూచించారు. ఇప్పటివరకు చెంచుగూడేలలో ఆధార్ నమోదు చేసుకోని వారు, ఈకేవైసీ పూర్తి చేసుకోని వారు మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవకాశాన్ని చెంచుగూడెల ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆయన ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

ట్రిపుల్ ఐటీలో ఇండోర్ స్టేడియం ప్రారంభం



ఇండోర్ స్టేడియం శిలాఫలకం వద్ద ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సోమయాజులు

కర్నూలు(సిటీ): నగర శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ డిజైన్ మ్యానుఫ్యాక్చరింగ్ (ట్రిపుల్ ఐటీ)లో రూ.3 కోట్లతో ఇండోర్ స్టేడియాన్ని నిర్మించారు. ఈ స్టేడియాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు, రిజిస్ట్రార్ గురుమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సోమయాజులు మాట్లాడుతూ ఇండోర్ గేమ్స్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసిందన్నారు. నిర్దేశించిన సమయం లోపే నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరిద్దాం

- విశ్రాంత ఐఏఎస్ అధికారి రాయుడు సూచనలు



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాపును ప్రారంభిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి రాయుడు, డీపీఎం వరలక్ష్మి తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింప జేసేందుకు కృషి చేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి, సీనియర్ కన్సల్టెంటు డాక్టర్ రాయుడు అన్నారు. రాయలసీమలోని ఎనిమిది జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు, అదనపు ప్రాజెక్టు మేనేజర్లు, సిబ్బందికి కర్నూలులో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ హోటల్ సమావేశ భవనంలో జరిగిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ... రాబోయో ఐదేళ్లలో ప్రకృతి వ్యవసాయాన్ని మరో 3 వేల గ్రామాలకు విస్తరింప చేయాలని లక్ష్యంగా తీసుకున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వల్ల వివిధ ప్రాంతాల్లో భిన్న ఫలితాలు వస్తున్నాయని, మరింతగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. రెండు రోజుల్లో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రణాళికలు తయారు చేయాలని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో రైతులకు మెరుగైన జీవితంతో పాటు సమాజానికి సురక్షితమైన ఆహారం అందించాలనే తపన ఉండేలా రైతుల్లో చైతన్యం తేవాలని సూచించారు. మరో సీనియర్ కన్సల్టెంటు మురళీధర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో 3,730 గ్రామాల్లో ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం పేరుతో ప్రకృతి వ్యవసాయం అమలవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో 5,500 గ్రామైక్య సంఘాలు పాలుపంచుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరింప జేయాలనేది రైతు సాధికార సంస్థ ఉద్దేశమని, దీనిని పెద్ద ఎత్తున రైతుల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి మాట్లాడుతూ... రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని, అయితే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం అవసరమన్నారు. పూర్వీకులు ఎలాంటి కెమికల్స్ లేని వ్యవసాయం చేశారని, మళ్లీ ఇపుడు అదే వ్యవసాయాన్ని చేపట్టడం ద్వారా నాణ్యమైన పంటలకు అవకాశం ఏర్పడిందన్నారు. సమావేశంలో రైతు సాధికార సంస్థ కన్సల్టెంట్లు రామచంద్రం, సురేంద్రరెడ్డి, రాజేశ్వర్, లక్ష్మి, దుర్గ, థిమాటిక్ లీడ్స్ ధర్మేంద్ర, సురేష్‌బాబు, రాయలసీమ జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు చంద్రశేఖర్, నరేంద్రరెడ్డి, వాసు, మునిరత్నం, లక్ష్మానాయక్, రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పాణ్యంకు గవర్నర్ రాక

పాణ్యం: రాష్ట్ర గవర్నర్ విశ్వ భూషణ్ హరి చందన్ త్వరలో పాణ్యంకు రాబోతున్నారు. స్థానిక గిరిజనులతో ముఖాముఖి అయ్యేందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. గిరిజనుల జీవన శైలి, అభివృద్ధి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి తెలుసుకునేందుకు గవర్నర్ పాణ్యం వస్తున్నారు. ఈనెల 18 లేదా 20వ తేదీన పర్యటన ఖరారయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, డీటీడబ్ల్యూఓ ఉసేనయ్య తదితరులు గవర్నర్ పర్యటన మేరకు బుధవారం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణం, కాన్వాయ్‌తో పాటు తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సభ నిర్వహిస్తే నెరవాడ వద్ద ఉన్న ఏపీ గిరిజన గురుకుల పాఠశాలలో హెలిప్యాడ్ ఏర్పాటుకు వీలుందా లేదా అనే విషయంపై ఆర్డీఓ, డీఎస్పీ మైదానాన్ని పరిశీలించారు. అంతకు ముందు చెంచుకాలనీలోని ఆశ్రమ పాఠశాల, పాణ్యం సచివాలయం-1 తదితర ప్రాంతాలను పరిశీలించారు. తాము పరిశీలించిన స్థలాల వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారి వెంట సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన సంపత్ కుమార్

గోనెగండ్ల: మండల పరిధిలోని ఎస్.లింగందిన్నె గ్రామ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాజులదిన్నె గ్రామానికి చెందిన సంపత్ కుమార్(26) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గాజులదిన్నె గ్రామానికి చెందిన సంపత్ కుమార్ ఎస్. లింగందిన్నె గ్రామంలో జరిగే దస్తగిరయ్య స్వామి ఉరుసుకు మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. రాత్రి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ఎస్. లింగందిన్నె గ్రామ సమీపంలో రోడ్డుపక్కన ఉన్న కల్వర్టును ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయం కావడంతో సంపత్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బొలెరో

- యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన వంశీ

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలో 44వ జాతీయ రహదారిపై కేవీ సుబ్బారెడ్డి కళాశాల దగ్గర బైక్‌ను బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీపురానికి చెందిన కె.వంశీ అనే యువకుడు తన సొంత పని నిమిత్తం బైక్‌పై దూపాడుకు వచ్చాడు. పని ముగించుకుని కేవీ సుబ్బారెడ్డి కళాశాల దగ్గర జాతీయ రహదారి ఎక్కుతుండగా బెంగళూరు నుంచి కర్నూలు వైపు వస్తున్న బొలెరో వాహనం(ఇంకా రిజిస్టర్ కాలేదు) అతివేగంగా ఢీకొట్టింది. యువకుడికి తీవ్ర గాయాలవడంతో 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. యువకుని తల్లి కె.లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా.. తొమ్మిది మందికి గాయాలు

గోనెగండ్ల: కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. బుధవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో తొమ్మిది మందికి తీవ్రగాయాలయ్యాయి. వేముగోడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు దస్తగిరి, లక్ష్మి, లక్ష్మీదేవి, అనిత, మద్దిలేటి, రోషిణి, పెద్దక్క, నాగమ్మ, లింగమ్మ బుధవారం ఉదయం ఆటోలో కులుమాల గ్రామంలో పనులకు వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని సాయంత్రం తిరిగి ఆటోలో వేముగోడు గ్రామానికి వెళ్తున్న క్రమంలో పుట్టపాశం గ్రామంలో కుక్క అడ్డువచ్చింది. దానిని తప్పించబోయే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందికి కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని 108లో కోడుమూడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దస్తగిరి, లక్ష్మి, నాగమ్మ, లింగమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.